# యువగర్జనతో చరిత్ర సృష్టించాం: ఎర్రన్నాయుడు



**న్యూఢిల్లీ, న్యూస్‌టుడే:** భారీస్థాయిలో 'యువగర్జన' సభ నిర్వహించి తెలుగుదేశం పార్టీ సరికొత్త చరిత్ర లిఖించిందని తెదేపా పార్లమెంటరీ పార్టీనేత ఎర్రన్నాయుడు పేర్కొన్నారు. భారీ సభలకు 'సింహగర్జన' ద్వారా ఎన్టీఆర్ పెట్టిన రికార్డును మళ్లీ మా పార్టీయే బద్దలు కొట్టిందని సంతోషం వ్యక్తంచేశారు. ఆయన గురువారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. యువగర్జన సభను నభూతో నభవిష్యతిగా అభివర్ణించారు. వచ్చిందంతా యువతేనని చెప్పారు. ప్రజల్లో పెల్లుబుకుతున్న ప్రభుత్వ వ్యతిరేకతకు ఇది నిదర్శనమన్నారు. యువగర్జన వేదికపై బీసీలకు ప్రాధాన్యం ఇవ్వలేదంటూ పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యల్ని తిప్పికొట్టారు. పార్టీ అధినేత చంద్రబాబుకి చెరోవైపు తాను, యనమల రామకృష్ణుడు ఉన్న విషయాన్ని ఆయనకు కనిపించలేదా అని ప్రశ్నించారు. డీఎస్ ధ్రుతరాష్ట్రుడిలా తయారయ్యారని విమర్శించారు.

## పురందరేశ్వరిది రాజును మించిన భక్తి

యువగర్జన జరుగుతున్న సమయంలో కేంద్రమంత్రి పురందేశ్వరి తమ సోదరులకు లేఖరాయడాన్ని ఎర్రన్నాయుడు తప్పుబట్టారు. చంద్రబాబునుద్దేశించి చేస్తున్న విమర్శలు ఆమె స్థాయికి తగ్గట్టుగా లేవని అభిప్రాయపడ్డారు. తండ్రి ఆశయాలకు విరుద్ధంగా కాంగ్రెస్‌లో చేరి ఇప్పుడు తెలుగుదేశం నాయకులను విమర్శించడంలో రాజును మించిన రాజభక్తిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజనలో ఆమె సీటు కోల్పోనున్నారని చెప్పారు. రాజ్యసభ సీటైనా దక్కించుకోవచ్చన్న ఉద్దేశంతో తెదేపాపై ఆరోపణలు చేస్తూ, కాంగ్రెస్ అధిష్ఠానాన్ని మెప్పిస్తున్నారని అన్నారు. యువగర్జన జరుగుతున్న రోజే ఢిల్లీలో సీడీలు విడుదల చేసిన ఉండవల్లి వైఖరినీ ఎర్రన్నాయుడు దుయ్యబట్టారు. ఈయన వైఎస్ కీలుబొమ్మని, ముఖ్యమంత్రి శత్రువులుగా భావించే వారిపై ఆరోపణలు చేయడమే ఈయన పని అని దుయ్యబట్టారు.